క్లుప్తంగా

నేడు నూతన కమిటీ ఎన్నిక

రాజేంద్రనగర్: బుద్వేల్ శివాంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకోనున్నట్లు కమిటీ చైర్మన్ మజ్జిగ అశోక్‌యాదవ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు దేవాలయ ఆవరణలో సభ్యులను ఎన్నుకుంటామన్నారు .

పుస్తకావిష్కరణ



రాజేంద్రనగర్: కవి, రచయిత మన్నె మహాత్మారావు రచించిన రుద్ర నమక చమక భువన తారక పరమార్ధం పుస్తకాన్ని శనివారం ఆవిష్కరించారు. భవానీ కాలనీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గోకరి అర్జున్‌గౌడ్, సాహితీరత్న వేము వందనంలు హాజరయ్యారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి నీలకంఠం, అశోక్‌కుమార్, డాక్టర్ శ్రీరాములు, కృష్ణ, ఉమారెడ్డి, ఈశ్వర్, సతీష్, రామారావు, కృష్ణమూర్తి, పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి సిబ్బందికి ప్రమోషన్లు

మణికొండ: జలమండలి ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. ఉస్మాన్‌సాగర్ సెక్షన్‌లో జీపీఈలుగా పనిచేస్తున్న కృష్ణ, ఎం. కృష్ణారెడ్డి, డి.బాలరాజు, ఎం.చంద్రశేఖర్, ఎల్. రాంచంద్రారెడ్డి, జి.రమాదేవిలకు ఎస్‌పీఈలుగా పదోన్నతులు వచ్చాయి. వారిని తోటి ఉద్యోగులు, అధికారులు, యూనియన్‌ల నాయకులు శనివారం అభినందించారు.

స్వరార్చన.. నృత్యార్చన



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహిస్తున్న అన్నమయ్య స్వరార్చనలో భాగంగా శనివారం నృత్య గణేశ భరతనాట్య సంస్థ గురువు యం.లలిత వినోద్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులు జ్యోతిక, త్వతీత, ధనశ్రీ, సుష్మిత, ఇషిఖ, సూర్యభద్ర బేహరా, అశ్రిత కోవలి, భానుశ్రీ, లిఖితారెడ్డి, యస్.వర్షిణి, నివాసిణి గుప్తా, దీక్షిత, తమన్వి, విశ్లేష, తులసిభవాని, తనుశ్రీ,, సితారలు పాల్గొన్నారు.అలాగే గరుడ గమన, కొమ్మలాల, నవరసములది, తారకమంత్రము తదితర సంకీర్తనలతో అలరించారు.

జిల్లా అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ

మియాపూర్ : రంగారెడ్డి జిల్లా మాస్టర్ అథ్లెట్లు మరింతగా రాణించేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని రంగారెడ్డి జిల్లా మాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలో ఫిబ్రవరి 16 నుండి 19 వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ మాస్టర్ అథ్లెట్లో ప్రతిభ కనబరిచిన వారిని చందానగర్ హుడా కాలనీలో ఓ కార్యక్రమంలో సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మాస్టర్స్ అసోసియేషన్ సెక్రటరీ సురేందర్, అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, సభ్యులు ఏసురత్నం, బాల్‌రాజ్, శివలీల పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

గోల్కొండ: 20 ఏళ్ల క్రితం ఒకచోట చదువుకున్న విద్యార్థులు మళ్లీ కలుసుకున్నారు. గుడిమల్కాపూర్‌లోని సెయింట్ మేరీస్ -1999 బ్యాచ్ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. ఈ సమ్మేళనానికి తమకు విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఆహ్వానించారు. వారితో తమ అనుబంధాన్ని ఆత్మీయతను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి స్కూల్ ప్రిన్సిపాల్ జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో అంబటి కృష్ణ, మధు, దివ్య, వినోద్, బాలరాజ్ తదితరులున్నారు.

మే 9న త్రయోదశి ఆలయంలో భజన పోటీలు

నాంపల్లి: నక్క వెంకటమ్మయాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మే 9న హయత్‌నగర్‌లోని ఆటోనగర్ ద్వారకానగర్ కాలనీ త్రయోదశి ఆలయంలో భజన పోటీలు-2023 పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నక్క శ్రీనివాస్‌యాదవ్, బడేసాబ్ వెల్లడించారు. ఈ మేరకు భజన పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను మాసబ్‌ట్యాంక్‌లోని నఫీస్ రెసిడెన్సీలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి ఆవిష్కరించారు. నక్కా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ పోటీల్లో పాల్గొనదలచిన భజన బృందాలు మే 3వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 99482 41188, 91606 07662లలో సంప్రదించాలని సూచించారు.



నార్సింగిలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్



పుప్పాలగూడలో..



శంషాబాద్‌లో ఈద్గా వద్ద..

ఘనంగా రంజాన్

రాజేంద్రనగర్: రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. శివరాంపల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, శాస్త్రీపురం ప్రాంతాల్లోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో వేలాదిమంది పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనల నేపథ్యంలో రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈద్గాల వద్ద బందోబస్తును రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, ఏసీపీ గంగాధర్‌లు స్వయంగా పరిశీలించారు. ఈద్గాల వద్ద ప్రార్థనలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా జీహెచ్‌ఎంసీతో పాటు ఈద్గాల కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ప్రార్థనల అనంతరం ఒకరికొక్కరు రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

మణికొండ: రంజాన్‌ను శనివారం భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. శుక్రవారం రాత్రి చంద్రుడు కనిపించటంతో శనివారం పండగ చేసుకోవాలని మత పెద్దలు ప్రకటించారు. నార్సింగి, మంచిరేవుల, గండిపేట తదితర గ్రామాలల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పుప్పాలగూడలో బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహ్మద్ బషీర్ ఏర్పాటు చేసిన విందులో ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే నార్సింగిలో మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు ముక్తార్ పాషలు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



బండ్లగూడ: కార్పొరేటర్ సయ్యద్ ఆసియాఖాజా ఇంట్లో విందులో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు



ఉస్మాన్ మసీదు వద్ద..



ఈద్గా వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు



హోమం చేస్తున్న భక్తులు

రాజేంద్రనగర్: హైదర్‌గూడ ఎర్రబోడలో బీరప్ప స్వామి జాతరలో భాగంగా శనివారం హోమం, బీరప్ప గుడి మైలలు, గంగతెప్ప తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం దేవాలయ ఆవరణలో చేసిన హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆదివారం బీరప్పస్వామి కామరాతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేపట్టారు. హైదర్‌గూడ పరిసర ప్రాంతాలకు చెందిన కురుమ కులస్తులు సాయంత్రం సామూహిక బోనాలతో దేవాలయానికి రానున్నారు. ఐదు సంవత్సరాల అనంతరం ఈ పండుగను చేపడుతున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని రోటరీ క్లబ్, ఐసీఏఆర్ (చిరుధాన్యాల పరిశోధన సంస్థ),ఐఐఎం ,శంకర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేశారు. కంటి శుక్లాలు ఉన్న 15 మందిని గుర్తించి ఈ నెల 30న శంకర్ కంటి వైద్య శాలలో ఆపరేషన్ చేయించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ సత్యవతమ్మ, వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ పరిశోధన సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన రంజాన్ మార్కెట్



బోసిపోయిన చార్‌కమాన్-చార్మినార్ రోడ్డు

చార్మినార్: పాతబస్తీలో నెల రోజుల పాటు కొనసాగిన రంజాన్ మార్కెట్ ముగిసింది. శనివారం రంజాన్ పండగ కావడంతో రంజాన్ మార్కెట్ కొనసాగిన ప్రధాన రోడ్లు బోసిపోయి ఖాళీగా కనిపించాయి. మదీనా నుంచి మక్కా మసీదు వరకు గల ప్రధాన రోడ్డులో నెల రోజులుగా రంజాన్ మార్కెట్ కొనసాగింది. ప్రతిరోజూ ప్రజలు తమకు అవసరమైన వస్తువులను ఖరీదు చేయడానికి నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా పాతబస్తీకి రావడంతో చార్మినార్ పరిసరాలు కిటకిటలాడాయి. ఇలా నెల రోజుల పాటు కొనసాగిన రంజాన్ మార్కెట్ ఈద్-ఉల్-ఫితర్ పండగతో ముగిసింది.

అమిత్‌షా సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

రాజేంద్రనగర్: చేవెళ్లలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి, శక్తి కేంద్రం ఇన్‌చార్జీ రాచూరి రాజశేఖర్ కోరారు.ఇందుకు సంబంధించి అత్తాపూర్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, మునీందర్, చరణ్, ప్రసాద్, అంకూర్, బన్సల్, రామమూర్తి, యాదయ్య, శివ, సంతోష్, వర్మ, నేమిచంద్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల సభకు తరలివెళ్లాలి..

మణికొండ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాక సందర్భంగా ఆదివారం చేవెళ్లలో ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగసభకు మణికొండ మున్సిపాలిటీ నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెల్లాలని బీజేపీ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం మణికొండ పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు సి.బీరప్ప, కౌన్సిలర్‌లు బి.శ్వేత రవికాంత్‌రెడ్డి, ఎల్. వందన నగేష్, కోఆప్షన్ సభ్యులు జె.సిద్దప్ప, జె.లక్ష్మీరాములు, నాయకులు ఇందిర, రాఘవరెడ్డి, అనితాదేవి, వెంకటయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

నానక్‌రాంగూడలో పబ్లిక్ కాంటాక్ట్



నానక్‌రాంగూడలో సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: ప్రజలు, ప్రభుత్వ అధికారుల మధ్య సమన్వయంతోనే సమస్యలు పరిష్కారానికి నోచుకుంటాయని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని నానక్‌రాం గూడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ పబ్లిక్ గ్రీవెన్స్ డిస్పోజల్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, అధికారులతో ముఖాముఖి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను అధికారులు ఎప్పటికప్పుడు నోట్ చేసుకుంటూ వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్, జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఎల్‌ఓ కృష్ణ, వర్క్ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది కిష్టయ్య, శ్రీనివాస్, సుమన్, మహేందర్ నాయకులు కైలాష్‌సింగ్, ముత్యంరెడ్డి, శివసింగ్, యాదగిరి, మల్లేష్, అరుణ్‌గౌడ్, గోపాల్, కవిత, మహేందర్, సత్యనారాయణసింగ్ ,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జయభేరి' ఆవిష్కరణ

గచ్చిబౌలి: ప్రముఖ జర్నలిస్ట్, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి రచించిన ' శ్రీశ్రీ జయభేరి 'పుస్తకావిష్కరణ ఆదివారం ఉదయం 10.30 గంటలకు గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ప్రధాన గ్రంథాలయం ఆధ్వర్యంలో జరుగుతుందని విజ్ఞాన కేంద్రం తెలిపింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ, గాయకుడు గోరటి వెంకన్న, తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, సీనియర్ కవి విమర్శకులు నిఖిలేశ్వర్, సినీ రచయిత సాయి మాధవ్, తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

సర్పంచ్‌పై కేసు

శంషాబాద్ రూరల్: పట్టా భూమి చుట్టూ చేపట్టిన ప్రీకాస్ట్ పనులను అడ్డుకున్న సర్పంచ్, అతడి అనుచరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దతూప్రలో నందకిషోర్ కుటుంబ సభ్యుల పేరిట 33 గుంటల పట్టా భూమి ఉంది. గ్రామానికి ఆనుకుని ఉన్న ఈ భూమిలో గతంలో ప్రభుత్వ పాఠశాల భవనం ఉండేది. పాఠశాలను వేరే చోటకు మార్చారు. అయితే పట్టా భూమిపై కోర్టు నుంచి హక్కుల పొందిన యజమానులు ఇటీవల అక్కడ ప్రీకాస్ట్ పనులు చేపట్టారు. ఈ పనులకు పంచాయతీ నుంచి అనుమతి లేదని, అనుమతి కావాలంటే డబ్బు లేదా కొంత స్థలం ఇవ్వాలని సర్పంచ్ చిటికెల వెంకటయ్య డిమాండ్ చేశాడన్నారు. పనులను అడ్డుకోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు.

మూడోసారి ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల శ్రీధర్

రాజేంద్రనగర్: గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శిగా బుద్వేల్‌కు చెందిన పెండ్యాల శ్రీధర్ నియమితులయ్యారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రేటర్ రజక అభివృద్ధి సంస్థ నూతన కమిటీని చైర్మన్ నర్సింహ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారన్నారు. వరుసగా తనకు మూడోసారి ప్రధాన కార్యదర్శిగా అవకాశం లభించిందన్నారు. దోభీఘాట్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని, రజకులకు రావాల్సిన పథకాలపై అధికారులతో చర్చించి వచ్చేలా చూస్తానన్నారు.

ఘనంగా వరల్డ్ ఎర్త్‌డే

గోల్కొండ: షేక్‌పేట్‌లోని జి. నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం వరల్డ్ ఎర్త్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధ్యాపకుల సహకారంతో వరల్డ్ ఎర్త్‌డే ప్రాముఖ్యత గురించి ఎల్‌ఈడీ డిస్‌ప్లే ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని న్యూఢిల్లీకి చెందిన ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేశామని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి తాము కళాశాల పరిసరాల్లో ఉన్న పాఠశాలలు, కాలనీ సంక్షేమ సంఘాలతో పాటు విద్యార్థులను కూడా ఆహ్వానించామన్నారు. దీనివల్ల ధరిత్రి పరిరక్షణకు తామిచ్చే సందేశం ప్రతిఒక్కరికీ చేరుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ధరిత్రి దినోత్సవంలో పాల్గొన్న వాలంటీర్లు

భూమిని కాపాడుకోవాలి

- రిటైర్డ్ ఐఏఎస్, సీఎం సలహాదారు డా.జోషి
- నెక్నాంపూర్‌లో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

మణికొండ: ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ చిన్న చెరువు వద్ద శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఐఏఎస్, ముఖ్యమంత్రి సలహాదారు డాక్టర్ ఎస్‌కే జోషి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని పరిరక్షించుకోకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఉపద్రవాలు వస్తాయన్నారు. చెరువులు, వాగులలో చెత్త చెదారం వేయవద్దని, అవన్నీ నీరు, భూమిలో చేరి విషతుల్యం అవుతాయన్నారు. ఈ సందర్భంగా టాటా ప్రాజెక్ట్స్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ఉద్యోగులు వాలంటీర్లుగా చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ డైరెక్టర్ ఫరీదా, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ దీప్తి శర్మ, హెచ్‌సీయు ప్రొఫెసర్ రమేష్‌శర్మ, ధ్రువాన్ష్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మధులిక పాల్గొన్నారు.

ఇంద్రారెడ్డికి ఘన నివాళులు

రాజేంద్రనగర్: మాజీ హోంమంత్రి ఇంద్రారెడ్డి వర్ధంతిని రాజేంద్రనగర్ సర్కిల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పీడీపీ చౌరస్తాలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పట్లోళ్ల ఇంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కార్తీక్‌రెడ్డి, కార్పొరేటర్ అర్చనజయప్రకాష్, పూలే జయంతోత్సవ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున్‌గౌడ్, కొలన్ సుభాష్‌రెడ్డి, రాపోలు సత్తయ్య తదితరులు హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఈఎన్ అశోక్, కొత్త రాజశేఖర్‌రెడ్డి, యాదమ్మ యాదవ్, పోరెడ్డి ధర్మారెడ్డి, డి.రమేష్‌ముదిరాజ్, నరేష్‌యాదవ్, పిట్టల శివముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్ గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పచ్చ శ్రీనివాస్ ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రఘు ముదిరాజ్, మల్లన్న, యాదమ్మ, నారాయణస్వామి, సత్యం, వీరప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ దర్గాఖలీజ్‌ఖాన్‌లో ఇంద్రారెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కొకుంట్లలో...

మణికొండ: మాజీ హోంమంత్రి పి.ఇంద్రారెడ్డి, వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున నివాళులు అర్పించారు. గండిపేటలోని ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం కొకుంట్లలోని ఆయన సమాధి వద్ద మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు నివాళులు అర్పించారు. మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్ తదితరులు తరలివెళ్లారు.



పీడీపీ చౌరస్తా వద్ద ఇంద్రారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కార్తీక్‌రెడ్డి తదితరులు



ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న సబితారెడ్డి, నాయకులు

సేంద్రియ ఎరువుల విక్రయ కేంద్రం ప్రారంభం



ఎరువుల కేంద్రం వద్ద మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కమిషనర్‌లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ప్రతి రోజు ఉత్పత్తి అవుతున్న తడి చెత్తతో సేంద్రియ ఎరువులను తయారు చేసి నామమాత్రపు ధరకు తిరిగి ప్రజలకు విక్రయించే కేంద్రాన్ని మణికొండ మున్సిపాలిటీలో శనివారం సాయంత్రం ప్రారంభించారు. అలకాపూర్ టౌన్‌షిప్‌లోని నేతాజి పార్కులో ఎరువుల కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో వచ్చే తడి చెత్తతో సేంద్రియ ఎరువులు, దేవాలయాల నుంచి వచ్చే పూలతో ధూప్ స్టిక్‌ల అమ్మకాలు చేపడుతున్నామన్నారు. ప్రజలు మొక్కలకు అవసరమయ్యే సేంద్రియ ఎరువులను కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి, కౌన్సిలర్‌లు శ్రీకాంత్‌స్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.